# 8. కార్తీక్

వాడు విశాఖపట్నం కింగ్‌జార్జి హాస్పిటల్‌లో పుట్టాడు.

తొలి చూలు కాన్పుని వాళ్లమ్మను హాస్పిటల్‌లో చేర్చారు.

మూడవనెల వెళ్లిపోతూ ఉంటే, వాళ్లనాన్న కలకత్తా నుంచి వచ్చాడు. ఎలమంచిలి నుండి ఎవరో బంధువులు వచ్చారు. బాలసారి చేసుకొని, వచ్చిన మూడో రోజునే, అతడు పెళ్ళాన్ని, కొడుకుని తీసుకొని వెళ్లిపోయాడు. కుర్రాడికి 'కార్తిక్' అని పేరు పెట్టారు. అల్లుడి తండ్రి వెంకట నారాయణ, పిల్ల తండ్రి సుబ్బారావు. ఆనవాయితీ ప్రకారం తాతల పేర్లలో ఒకటి కుర్రాడికి ఎందుకు పెట్టలేదని, ఎవరో బంధువులు నామకరణ మహోత్సవంలో పంటివాడి తల్లిని అడిగారు. ఆమె నవ్వి ఊరుకుంది.

"మా ఆవిడ విపరీతంగా బెంగాలీ నవలలు చదువుతుంది. వాటి ప్రభావమిది." అన్నాడు పిల్లవాడి తండ్రి.

సుబ్బారావు కూతురికి ఈ ప్రాంతాలలో సంబంధాలు ఏవీ దొరలేదా అన్న ప్రశ్న వస్తుంది...

ఒకనాటి సాయంకాలం సుబ్బారావు డ్యూటీ నుండి ఇంటికి వచ్చాడు. ముందుగదిలో ఒక దంపతుల జంట వాళ్ల అబ్బాయి కూర్చొని కాఫీలు తాగుతున్నారు. ఫలహారాలు ముగించి.

వచ్చిన అతిథి తననుతానే పరిచయం చేసుకున్నాడు.

"బావగారు! నా పేరు వెంకట నారాయణ, ఈమె నా ధర్మపత్ని, వీడు నా పెద్దకొడుకు కామేశ్వరరావు. నేను ఆగ్నేయ రైల్వేలో మెయిలు డ్రైవరుగా సంతరాగాఛ్‌లో పని చేస్తున్నాను. నాకు ఇద్దరు కొడుకులు. రెండోవాడు ఎలమంచిలిలో చదువుకుంటున్నాడు. నాకింకా రెండు సంవత్సరాలుంది రిటైరవడానికి. మా పెద్దవాడు ప్రస్తుతం బడాబజారులో ఒక దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. నాకు ముప్ఫైతొమ్మిదేళ్ల సర్వీసు. గార్డెన్‌రీచి హెడ్డాఫీసులో నాకు చాల మంది రైల్వే అధికారులు తెలుసు. నా సర్వీసు రికార్డు చాల బాగుంది. తప్పకుండా నా కొడుక్కి రైల్వేలో మడవ తరగతి ఉద్యోగం దొరుకుతుంది.

"మీ కుటుంబం మంచిదని, మీ మూడవ అమ్మాయికి సంబంధం వెతుకుతున్నారని తెలిసింది. సంతరాగాఛ్‌లో లంకంత రైల్వే ఇల్లు నాకుంది. కోడలితోను, మనుమలతోను ఆ ఇంట్లో హాయిగా గడపాలని నా భార్య కోరుతున్నది కట్నాలు, కానుకలు నామమాత్రంగా ఉంటే చాలు. మీ అభిప్రాయం తెలియజేస్తే చాల సంతోషిస్తాము."

సుబ్బారావు, అతని భార్య చాలాసేపు ఆలోచించారు. కుర్రాడికి స్థిరమైన ఉద్యోగమేదీ

లేదన్నలోపం తప్ప, అన్ని విధాల సంబంధం బాగుంది. అతడు ఇంటరు పాసయాడు, తండ్రి మంచి ఉద్యోగం చేస్తున్నాడు. అధికారులందరూ అతనికి తెలుసు. ఇవాళ కాకపోతే రేపయినా రైల్వేలో మూడవ తరగతి ఉద్యోగం దొరుకుతుంది. వాళ్లు అంగీకరించారు.

పెళ్లి అన్నవరంలో జరిగింది.

తరువాత అమ్మాయి అత్తవారింటికి వెళ్లిపోయింది.

సంతరాగాఛ్‌లో, అక్కడక్కడ తెలుగువాళ్లున్న అందరూ బెంగాలీవాళ్లే.

సుబ్బారావు స్కూలుఫైనలుతో అమ్మాయి చదువు మానిపించాడు. అప్పటి నుంచి సరోజ మరో ఆరు సంవత్సరాలు విడువకుండా తెలుగులో నచ్చిన నవలలన్నీ చదివింది. అత్తవారింట్లో అంతా కొత్త వాతావరణం నెలకొంది. బెంగాలీ నేర్చుకోకపోతే రోజు గడవదు. అందుచేత బెంగాలీ వర్ణమాల నుండి నేర్చుకుంది. ఆరు నెలల్లో బెంగాలీ క్షుణ్ణంగా వ్రాయడం, చదవడం వచ్చాయి. స్థానికులతో మాట్లాడుతూ, వాళ్ల బట్ట, కట్టూ అలవరచుకుంది.

సరోజకు పెళ్లయిన రెండు సంవత్సరాలలో అత్తగారు పోయారు.

మరో ఆరునెలలకు మామగారు ఉద్యోగం నుండి రిటైరయారు.

వెంకట నారాయణ చిన్నప్పుడు నాలుగు సంస్కృతం ముక్కలు నేర్చుకున్నాడు. అవి అతనికి బాగా పనికి వచ్చాయి. గార్డెన్‌రీచ్‌లో రైల్వే ఆఫీసర్ల ఇళ్లలో సత్యనారాయన వ్రతాలు చేయించడం, తద్దినాలు పెట్టించడం వంటి పనలు అతడు చేస్తూ ఉండేవాడు.

శంకరయ్యరు చీఫ్ ఇంజినీరుగా వచ్చాడు. అతడు వెంకట నారాయణను తల్లి తద్దినానికి పిలిచాడు. సంస్కృతం మంచి ఉచ్చారణతో చదువుతూ నియమనిష్ఠలతో అతడు తద్దినం పెట్టించడం అయ్యరుకి నచ్చాయి. తరువాత మరో ఆరునెలల్లో అతని తండ్రి తద్దినానికి వెంకటనారాయణను పిలిచాడు. తద్దినం పూర్తయి, భోజనాలు ముగిసిన తరువాత, తాంబూలం చేతిలో పెడుతూ వెంకట నారాయణను అయ్యరు అడిగాడు :

"మీకు పిల్లలెంతమంది?"

"ఇద్దరు, దొరగారు! పెద్దవాడు ఇంటరు పాసయాడు. రెండోవాడు ఎలమంచిలిలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు."

"బాగుంది! మీ పెద్దకుర్రాడు ఎక్కడేనా ఉద్యోగం చేస్తున్నాడా?"

"పేరుకి బడా బజారులో ఒక దుకాణంలో పనిచేస్తున్నాడు. వాడి గురించే నాకు చింత. ఏదో తమచేతిలో చాల ఉద్యోగాలుంటాయి..."

"గుమస్తా ఉద్యోగాలకి సర్వీసు కమిషను పరీక్ష పాసుకావాలి. ఏ ఇంజనీరు కిందో గాంగ్‌మాన్‌గా ముందువేసుకొని, ఏ స్టోరులోనే పనిచేయించి, క్రమంగా మీదకు తీసురావచ్చు."

"ఆ ఉపకారం చేసిపెట్టండి, దొరగారు!"

శంకరయ్యరు తప్పకుండా చేస్తానన్నాడు. ఆ భరోసామీదే కొడుక్కి పెళ్లి చేశాడు, వెంకటనారాయణ.

కాని ఆ అదృష్టం కలిసిరాలేదు.

శంకరయ్యరు రైల్వే బోర్డు మెంబరుగా వెళ్లిపోయాడు. అతని జాగాలో మరొకరు వచ్చాడు. అతను ఆంగ్లో ఇండియన్.

ఇంతలో భార్య పోవడం, రిటైరవడం, చిన్న ఇంటిలో అద్దెకు దిగడం వంటివి సంభవించాయి. బతకడానికి ఇబ్బంది లేకుండ అతనికి మంచి పెన్షను వస్తుంది.

ఒకరోజు అతనికి పక్షవాతం వచ్చింది. పెద్దకొడుకు ఉద్యోగం మాని తండ్రి సపర్యలలో ఇరవైనాలుగు గంటలు ఉండిపోయాడు.

సరోజ నెల తప్పింది.

మొదటి పురుడని పుట్టింటికి విశాఖపట్నం పంపించారు.

ఈ పరిస్థితులలో కార్తీక్ పుట్టాడు.

సరోజ అత్తవారింటికి తిరిగి వచ్చేసరికి కొన్ని ఇబ్బందులు ఎదురయాయి. వెంకటనారాయణ చికిత్స కోసం స్పెషలిస్టులను కలకత్తా నుండి ఇంటికి తెప్పించి వైద్యం చేయించారు. అతని మందులకి, ఫిజియోథెరఫీకి, డాక్టర్ల ఫీజులకి నెలకి మూడువేల రూపాయలు ఆయ్యేవి. కార్తిక్‌కి పాలడబ్బులు కొనవలసివచ్చేది. చాల జాగ్రత్తగా సంసారం చేసినా డబ్బుకు చాల ఇబ్బంది పడేవారు.

కార్తీక్‌కి అయిదేళ్లు వెళ్లిపోయాయి. ఎలిమెంటరీ స్కూలులో వాడిని చేర్చారు.

ఒకరోజు సరోజ, కామేశ్వరరావు చాలతీవ్రంగా ఆలోచించారు. సంతరాగాఛ్ నుంచి హౌరా స్టేసనుకు కాళీ బళ్లు వెళ్తాయి. హౌరా చేరుకున్న బళ్ల కాళీబోగీలు సంతరాగాఛ్‌కి మరామత్తుకు, నీళ్లు పట్టడానికి వస్తాయి. ఇటు నుండి వెళ్లి అటునుండి తిరిగి రావడానికి ఇబ్బంది లేదు. హౌరా చేరుకున్న ప్రయాణికులు ఇతర ప్రదేశాలకు వెళ్లడానికి బండి వచ్చే వరకు ఫ్లాట్ ఫారమ్‌ల మీద కూర్చుంటారు. తాజాగా ఇడ్లీలుచేసి హౌరా ఫ్లాట్‌ఫారాల మీద అమ్మవచ్చు. అన్ని ఫ్లాట్‌ఫారాలు తిరగనక్కరలేదు. రెండో మూడో ఫ్లాట్ ఫారాలు తిరిగితే చాలు. ఉదయం తొమ్మిది నుండి పదకుండు వరకు కామేశ్వరరావు, తండ్రికి సపద్యలు చెయ్యనక్కరలేదు. ముసిలాయన నిద్రపోతారు. హౌరా వెళ్లడం పావుగంట రావడం పావుగంట, ఆ మధ్య కాలంలో ఇడ్లీలు అమ్మవచ్చు. ఇడ్లీని రూపాయికి అమ్మితే సగానికి సగం లాభం వస్తుంది.

కార్తీక్ రైల్వే హైస్కూలులో ఆరవతరగతిలో చేరేసరికి ఈ ప్రణాళిక అమలులోకి వచ్చింది.

ఉప్పుడు బియ్యం నూకతో ఇడ్లీలు చాలమృదువుగా తయారయ్యేవి మొదటినెలలో ఖర్చులు పోను రెండువేల రూపాయలు లాభం వచ్చింది.

వెంకటనారాయణ రెండవ కొడుకు చదువు పూర్తిచేసి ఎలమంచిలిలోనే ఉద్యోగంలో చేరాడు. అతనికి నెలకు అయిదువందలు పంపించేవారు. ఇప్పుడది పంపక్కరలేదు. ఇడ్లీలు అమ్మడం మొదలు పెట్టిన దగ్గిర ఉంచీ కొంచెం వెసులుబాటు కలిగింది. కాని, సరోజకు పిండి రుబ్బడం, ఇడ్లీ వాయలు దించడం, పచ్చడి, సాంబారు తయారు చేయడం వంటి పనులు అదనంగా చేయవలసి వచ్చేది. వయసులో ఉంది కాబట్టి సునాయాసంగా నెరవేర్చేది.

కార్తీక్‌కి పదోయేడే వచ్చింది. ఒకరోజు చవకరకం ప్లాస్టిక్ క్రికెట్ బాటు, రబ్బరు బంతి వాడిచేతిలో సరోజకు కనిపించాయి.

“ఇవేమిటి కార్తిక్?” ఆమె అడిగింది.

“నేను క్రికెట్ ఆడుతున్నాను. మమ్మీ!”

ఆమె నవ్వింది.

కార్తీక్ చాల చురుకైనవాడు, అనర్గంగా బెంగాలీ మాట్లాడేవాడు. బడిలో బెంగాలీ, హిందీ, ఇంగ్లీషు చదువుకుంటున్నాడు. లెక్కలు బాగా చేస్తాడు. కాని, ఈ మధ్య వాడు ఆటలలోపడి శ్రద్ధగా చదవడం లేదు. ప్రోగ్రెస్ రిపోర్టు ‘ఏవరేజ్’ అని వచ్చింది.

ఆమె మనసులో మెరుపు మెరిసింది.

క్రికెట్ పేరుతో వాడిని ముందుకు నడిపించాలి.

వాడి చదువు సంధ్యలు, భవిష్యత్తు తీర్చిదిద్దడానికి మంచి అవకాశం వచ్చింది. ఇప్పటి నుంచి మొదలుపెట్టి ................ వాడిని ముందుకు నడిపిస్తే దివ్యమైన ఫలితాలు కలుగును.

బెంగాలులో బంతి ఆటకు ప్రాధాన్యముంది. ఈ మధ్య ఆ రాష్ట్రం కుర్రాడు వెలుగులోకి వచ్చిన తరువాత క్రికెట్‌పై శ్రద్ధ హెచ్చయింది.

చాలామంది కుర్రాళ్లు క్రికెట్ ఆడతారు. కాని వాళ్లకు బంతి 163 గ్రాములుంటుందని, దాని చుట్టుకొలత 22.9 సెంటిమీటర్లుంటుందని, బేటు పొడవు 96.5 సెంటిమీటర్లని, అడుగు భాగం వెడల్పు 10.8 సెంటిమీటర్లని, స్టంపుల మధ్యదూరం 20.12 మీటర్లని తెలియదు. చాలపారిభాషిక పదాలు వాళ్లకు తెలియవు. పిచ్ సరిగా ఉండదు, క్రీసెస్ సరిగా మార్కు చేయరు, స్టంపులు ఏవో నిలబెడతారు. బెయిల్సు ఉండవు. బంతిగాని, బాలుగాని సరియైన పరిమాణంలో ఉండదు. ముందు నుంచి రూల్సుని పాటించి ఆడితే అలవాటవుతుంది. తల్లి చెప్తున్న మాటలన్నీ కార్తీక్ శ్రద్ధతో వినేవాడు.

ఒకరోజు రైల్వే వెల్‌ఫేర్ ఆపీసరు గార్డెన్ రీచ్ నుండి స్కూలు తణికీకి వచ్చాడు.

అప్పటికి కార్తీక్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మొదటి నుండి అన్ని విషయాలలోను శ్రద్ధ వహిస్తున్న కార్తీక్, కెప్టన్‌గానే వ్యవహరించేవాడు.

ఆ సాయంకాలం ఆఫీసరు సమక్షంలో కుర్రాళ్లు క్రికెట్ ఆడారు. వాళ్లు చాలచక్కగా ఆటనియమాలను పాటించి ఆడడం చూసి అతను చాలా సంతోషించాడు. ఒక్కవారం రోజుల్లో, బాట్‌లు, బంతులు, పాడ్‌లు, గ్లవ్‌లు - ఇలా ఇలా క్రికెట్ ఆటకి అవసరమైన వాటినన్నిటిని రైల్వే తరపున ఆఫీసరు సరఫరా చేశాడు.

ఒకటెర్మ్ కార్తీక్‌కి ఇంగ్లీషులో చాల తక్కువ మార్కులు వచ్చాయి. సరోజ కోపగించుకో లేదు. మరోమంచి అవకాశం వచ్చినందుకు సంతోషించింది.

క్రికెట్ ఆడేవాళ్లు భారతదేశంలోనే కాక పై దేశాలలో కూడా ఉన్నారు. బ్రిటన్, అస్ట్రేలియా, న్యూజిలాండు, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, శ్రీలంక, పాకిస్తాన్ మొదలైన దేశాలలో అడతారు. వాళ్లు ఇంగ్లీషు మాట్లాడతారు, చాలా బాగా మాట్లాడతారు.

సరోజ అంతవరకే చెప్పింది. తరువాత కార్తీక్ చాలా శ్రమపడ్డాడు. ఇంగ్లీషు మాస్టరు నుండి ఉచ్చారణ నేర్చుకున్నాడు. విరివిగా ఇంగ్లీషు పుస్తకాలు చదివేవాడు. తను చదవడమే కాకుండా తనటీములోని విద్యార్థులచేత చదివించాడు. పెద్ద పరీక్షలలో వాడు ఇంగ్లీషులో మొదటివాడుగా వచ్చేడంటే ఆశ్చర్యమేముంది?

కార్తీక్‌కి క్రికెట్ ఆడే మహామహుల పేర్లన్నీ తెలుసు. ఎవరు మంచి బౌలర్లో, ఎవరు గొప్ప బాట్స్‌మన్లో తెలుసు ఏయే మ్యాచ్‌లలో భారతదేశం విజయం కాంచిందో, ఏయే దేశాలలో ఓడిపోయిందో తెలుసు. గెలుపుకి కారణాలు ఏవో, ఓటమి తప్పించుకొని ఘన విజయం సాధించడానికి మెలకువలు ఏవో అధ్యయనం చేశాడు. తన స్కూలు టీమ్‌లో పదహారుమందిని బాగా తయారు చేశాడు. పదకొండుమంది ఆడినా, మిగిలిన వాళ్లు అదనంగా అవసరాలకు అందుబాటులో ఉండేవారు అందరూ వంతుల ప్రకారం ఆడడానికి అవకాశం కల్పించాడు. ఆవిధంగా అడేటప్పుడు మంచి బాట్స్‌మన్‌ని మంచి బౌలర్లను ఎంచుకున్నాడు. వాళ్లకి మెలకువలు నేర్పించాడు.

ఒకసారి సరోజ అడిగింది. "ఏమిరా కార్తీక్, నువ్వు బాట్స్‌మన్‌గా ఉంటావా, లేక బౌలింగ్ చేస్తావా?

"నేనయితే బౌలింగ్ చెయ్యగలను, బాట్స్‌మన్‌గాను అడగలను. కాని... " సగంలో ఆగిపోయాడు.

"ఆగిపోయావేం? నువ్వు కెప్టన్‌ని, బౌలింగు బాటింగు బాగా రావాలి. కేప్టన్ అన్నవాడు సవ్యసాచి. మరి నీ నేర్పు ఎందులో ప్రదర్శించగలవు."

నాకు బాటింగ్ చాలా ఇష్టం. సిక్సర్లు, మాములు బౌండరీలు కొడుతూ ఉంటే,

థ్రిల్లింగ్‌గా ఉంటుంది."

ఆమె నవ్వింది.

సరోజకు తెలుసు. ఆమె కార్టీక్ ఆడిన మాచ్‌లను చూసింది. ఇద్దరో, ముగ్గురో అవుటయిన తరువాత కార్తీక్ రంగంలోకి దిగేవాడు. మొదటిలో మామూలుగా ఆడేవాడు. క్రమక్రమంగా నాలుగులు, ఆరులు కొట్టేవాడు. చివరి వరకు అవుటయేవాడు కాడు.

కార్తీక్ పదోక్లాసుకి వచ్చాడు. అటు క్రికెట్‌లోను ఇటు చదువులోను మొదటివాడుగా వచ్చేవాడు.

ఆ సంవత్సరం రైల్వే స్కూళ్లలో క్రికెట్ ఆడేవాళ్లకు డ్రెస్సులకోసం గ్రాంటు మంజూరు చేశారు. కార్తీక్ పొడుగు ఎదిగాడు, నడకలో ఒకఠీవి కనిపించింది. క్రికెట్ కోసం బట్టలు కుట్టించుకొని పాడ్‌లు, గ్లౌస్, హెల్‌మెట్ వేసుకొని బాట్‌పట్టుకొని ఇంటికివస్తే అందరూ ఆశ్చర్యపోయారు.

విజయదశమి వెళ్లిన వారం రోజులలో సంతరాగాఛ్ టీమ్‌కి, షాలిమారు రైల్వే స్కూలు టీమ్ వాళ్లకి ఒకరోజు మాచ్ నిశ్చయమయింది. రెండు స్కూళ్ల డ్రిల్లు మాస్టర్లు అంపయర్లుగా నిలబడ్డారు.

మాచ్ ఉదయం ఎనిమిదిన్నరకు మొదలయింది. ఆరోజు ఆదివారం ముఖ్యమైన అతిథులకు షామియానాల కింద కుర్చీలు వేశారు. పెద్దవాళ్లను పిలిచారు. మాచ్ చూడడానికి చాలామంది విద్యార్థులేకాక అభిమానులుకూడా వచ్చారు. ఆటగాళ్లకు ఒక హొటల్‌వాడు లంచి ఏర్పాటు చేశాడు. మరొకరు మంచినీళ్ల బాటిల్లు, సాఫ్ట్ డ్రింకులు సప్లయి చేశారు. అంతా అంతర్జాతీయపు ఒకరోజు మాచ్ పద్ధతిలో సాగింది.

సరోజ గ్రౌండుకి వచ్చేసరికి బాగా ఎండ వచ్చింది. కొంతమంది తలలమీద న్యూస్ పేపర్లు అడ్డుపెట్టుకున్నారు. పిచ్, క్రీసెస్, బౌండరీ సరిహద్దులు బాగా మార్కింగు చేశారు.

మాచ్ మొదలయి రెండు గంటలయింది. కార్తీక్ కెప్టెన్‌గా ఉన్నటీము ఫీల్డింగ్ చేస్తున్నది. నియమాలు తప్పకుండా ఆటనడిపిస్తున్నాడు కార్తీక్. వాతావరణం సౌమ్యంగా ఉన్నా ఆటగాళ్లు చెమటలు కక్కుతున్నారు. అప్పుడప్పుడు కార్తీక్ బౌలింగ్ చేసి రెండు వికెట్లు పడగొట్టాడు. ప్రేక్షకుల కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

లంచ్ బ్రేకులో సరోజ తొందరగా ఇంటికివెళ్లి, మామగారికి, భర్తకు భోజనం పెట్టింది. తన భోజనం పూర్తయిన తరువాత పనులలాగే విడిచిపెట్టింది. పక్కింటి ముసలాయన మామగారికి సాయంఉంటే, భర్తతో కలిసి మాచ్ చూడడానికి వెళ్లింది.

ఆడుతున్న కుర్రాళ్లలో ఒకడు ఇరవై పరుగుల తరువాత అవుటయాడు. మరో

పది బంతుల తరువాత మరొకడి వికెట్ పడిపోయింది. తరువాత కార్తీక్ వచ్చాడు. మొదట తాపీగా ఆట మొదలుపెట్టి, ఒకొక్కరన్ చేస్తూ, క్రమంగా నాలుగు, మధ్యమధ్య ఆర్లు కొట్టి చివరి వరకు వాడు అజేయంగా నిలిచాడు. నలుగురే అవుటయారు. నలభై ఓవర్లలో లక్ష్యం సాధించారు. ప్రతిసారి కార్తీక్ బౌండరీ కొట్టినప్పుడు చప్పట్లు, ఈలలు మారుమోగాయి. ఎవరో సంస్థవాళ్లు గెలిచిన వాళ్లకి కప్పు, ఓడినవాళ్లకు గెలిచినవాళ్లకు మొమెంటోలు పంచిపెట్టారు.

కార్తీక్ ఇల్లు చేరుకునేసరికి చీకటి పడుతున్నది. ముందు తాతగారికి పాదాభివందనం చేశాడు. తరువాత నాన్నకు అమ్మకు మొక్కాడు. పొద్దున్న నుంచి మైదానంలో జరిగిన ఆట గురించి తాతగారికి వివరంగా చెప్పాడు.

మాచ్ అయిన మూడో రోజున సంతరాగాఛ్ రైల్వే స్కూలు హెడ్మాస్టరుగారు, క్లాసులో ఉన్న కార్తీక్‌ని పిలిపించారు.

“కార్తీక్ మనస్కూలుకి నువ్వు పేరు తెచ్చావు. మేమందరం చాలా సంతోషిస్తున్నాం. ఒక ప్రేక్షకుడు వ్రాసిన ఉత్తరం నీకిస్తున్నాను. చదువుకో!” అన్నారాయన.

ఇంతలో బడిగంట మోగింది, పుస్తకాలు సర్దుకొని కార్తీక్ ఇంటికి వెళ్లిపోయాడు. కాళ్లు చేతులు కడుక్కొని ఫలహారమేదో చేసిన తరువాత వాడికి ఉత్తరం సంగతి జ్ఞాపకం వచ్చింది. దానిని బాగ్‌లోంచి తీసి చదువుకుంటూ తల్లి దగ్గరికి వచ్చాడు.

ఆ ఉత్తరం కలకత్తా నుంచి వచ్చింది. ఖరీదైన లెటర్ పేపరుమీద చక్కని దస్తూరీతో వచ్చిన ఇంగ్లీషు ఉత్తరమది.

ఉత్తరం చదువుకుంటుంటే వాడి ముఖంలో కళలు మారుతూ కనిపించాయి.

“నీలో నువ్వ చదువుకోకపోతే పైకి వినిపించరాదా?” అంది సరోజ.

ఇంతలో ఆమె భర్త కామేశ్వరరావు కూడా వచ్చాడు.

కుర్రాడు ఏ ఉద్రేకం లేకుండా, ఉత్తరం పైకి చదివాడు.

ప్రియమైన కార్తీక్,

మొన్న ఆదివారం జరిగిన క్రికెట్ మాచ్‌ని చూడడానికి వచ్చిన వాళ్లలో నేనొకడిని.

విశ్రాంతిగా కుటుంబంతో ఆదివారం గడపాలని ఆలస్యంగా నిద్రలేచాను. టీ తాగుతూ న్యూస్ పేపరు చూశాను. షాలిమార్ రైల్వే స్కూలుకి, సంతరాగాఛ్ స్కూలుకి ఒక రోజు మాచ్ అని చదివాను.

పది గంటలకు బొటానికల్ గార్డెన్‌కి కుటుంబంతో పికినిక్‌కి వెళ్లాలన్న ప్రోగ్రాము రద్దుచేసి, శ్రీమతికి క్షమాపణలు చెప్పి, తొందరగా మాచ్ చూడడానికి బయలుదేరాను.

రెండు, మూడు గంటలు మాచ్ చూసి భోజనానికి వస్తానని ఇంటి దగ్గర చెప్పి

వచ్చాను.

నేను మైదానం చేరుకునే సరికి పదిగంటలయింది. తలమీద ఫెజ్‌టోపీ, కళ్లకు గాగుల్సుని, పొడవాటి పంజాబీ తొడుక్కున్నాను. ఎవరూ నన్ను గుర్తుపట్టకుండా జాగ్రత్త పడ్డాను.

ఎవరో వ్యాపారి, వెనుకవరుస కుర్చీలలో కూర్చున్నవాడు లేచి వెళ్లిపోయాడు. వెంటనే దానిలో కూర్చున్నాను.

ఏ ఆలోచనలు లేకుండా చుట్టూ కలయజూశాను. ఫీల్డింగ్ బాగా జరుగుతున్నది. నువ్వు సంతరాగాఛ్ టీమ్‌కి కేప్టనునని ఎవరో చెప్పారు. నిశితంగా అంతర్జాతీయపు ఒక రోజు మాచ్ నియమాలను ఆటగాళ్లు పాటిస్తున్నారు.

ఇంకా శ్రద్ధపట్టి చూశాను. నువ్వు బౌలింగ్ చేశావు. మూడు వికెట్లు పడగొట్టావు. రెండు కేచ్‌లు పట్టావు.

నువ్వు చాలా తేలికగా అనుభవజ్ఞుడివలే ఆడుతున్నావు. చాలనేర్పుతో, ఏభై ఓవర్లలో ప్రత్యర్థులు నూటనలభై రన్నులను మించకుండా జాగ్రత్త పడ్డావు. తొమ్మండుగురు అవుటయారు.

నీ ఆట చూడడానికి ముచ్చటగా ఉంది. రెండు గంటలు చూసి వెళ్లిపోవాలని అనుకున్నవాడిని, నీ బాటింగ్ చూడకుండా వెళ్లలేకపోయాను.

ఆటమీద మోజుపడితే నేను అన్నీమరచిపోతానని నా శ్రీమతికి తెలుసు. ఆమె డబ్బాలో పెట్టి ఇచ్చిన భోజనం, మంచినీళ్లు నాకు లంచి బ్రేకులో బాగా పనికి వచ్చాయి.

రెండవపూట ఆట మొదలయింది. ఓపెనింగ్ బాట్స్‌మన్ ఎంపిక చక్కగా జరిగింది. అతను ఆడి ఇరవై రన్నుల తరువాత అవుటయాడు. కాచ్ పట్టేశారు. తరువాత వచ్చినవాడు పదిరన్నులకే వికెట్ పోగొట్టుకున్నాడు. నువ్వు మూడవ ఆటగాడివి.

నీ ఆటచాల శ్రద్ధతో పరికించాను.

చాలహాయిగా ఉద్రేకంలేకుండా ఆడుతున్నావు.

సంరక్షణాత్మకంగ నువ్వొకబంతి కూడా కొట్టలేదు. క్రమక్రమంగా నువ్వు విజృంభించావు.

నాలుగులు మొదలయాయి.

మధ్య మధ్యను ఆరులు.

ప్రేక్షకులు వెర్రులెత్తిపోయారు.

నలభై ఓవర్లలో లక్ష్యం చేరుకున్నారు, మీరు. నువ్వు పది నాలుగులు ఆరు ఆరులు కొట్టావు. చివరి బంతి వరకు నువ్వు అవుట్ కాలేదు.

నీ ఆట ప్రశస్తంగా ఉంది.

ఆట ముగిసేసరిగి అప్రయత్నంగా ఆనందబాష్పలుకారాయి.

నేనింతగా ఎప్పుడూ చలించలేదు.

ఏదో ఒకరోజు, నువ్వు జాతీయంగా, అంతర్జాతీయంగా, కెప్టెన్‌గా నా కన్న గొప్ప వాడివిగా రూపొందుతావు.

నీకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది.

గంగూలీ

ఎదురుగా నిలబడి పరవశత్వం పొందుతున్న తల్లిదండ్రుల పాదాలకు వంగి నమస్కారంచేసి, తాతగారికి ఉత్తరం చదివి వినిపించి నమస్కారంచేయడానికి కార్తీక్ వెళ్లాడు.